కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :114 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | బుధవారం 19-08-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## 'పెద్ది' విగ్రహాన్ని కూల్చడం అమానుషం

హనుమకొండ : దివంగత నేత తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని కూల్చడాన్ని నిరసిస్తూ చలో నర్సంపేట నిర్వహించాలని వరంగల్ పశ్చిమ బీఆఆర్ఎస్ నాయకులు పిలుపు ఇచ్చారు. దీనిలో భాగంగా ముందస్తుగా వారిని అరెస్టు చేసి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రభుత్వ అండదండలతో మున్సిపల్, పోలీసులను అడ్డుపెట్టుకొని విగ్రహాన్ని కూల్చివేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను జిల్లావ్యాప్తంగా అరెస్టు చేసి , గృహనిర్బంధాలు చేస్తున్నారని, ప్రజాపాలన పేరుతో దౌర్జన్యాలు చేస్తున్నారని, దివంగత నేత విగ్రహంపై ఇంత అరాచకాలు సృష్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ నేత విగ్రహం పెట్టుకునే హక్కు ఉందని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని బొందపెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వారు అన్నారు. అరెస్ట్ అయిన వారిలో



బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్లు?? చెన్నం మధు, సోదా కిరణ్, మైనార్టీ కమిషన్ మాజీ సభ్యులు జూని దర్శన్‌సింగ్, 4వ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్, బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంద శ్యామ్, పుష్పలత, బీఆర్ఎస్వీ నాయకులు రాసురి రాజేష్ ఉన్నారు.

## చిన్నారెడ్డిని సస్పెండ్ చేయాలి.. ఎమ్మెల్యే మేఘారెడ్డి సంచలన డిమాండ్



హైదరాబాద్, వనపర్తి కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డిని పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ అధిష్ఠానం చర్యలు తీసుకోకపోతే గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. చిన్నారెడ్డిపై కఠిన చర్యలు తీసుకునేవరకు తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన తేల్చిచెప్పారు.

### గోపాల్‌పేట సభే వివాదానికి కేంద్ర బిందువు

వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమమే ఈ అంతర్గత వివాదానికి ప్రధాన కారణమైంది. ఆ సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిని ఉద్దేశించి చిన్నారెడ్డి తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు గుప్పించారు. తన సహనం నశిస్తే మరో 'జీవన్‌రెడ్డి' తరహాలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై మేఘారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి చిన్నారెడ్డి నిరంతరం తననే టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. చిన్నారెడ్డిపై ఎదురుదాడికి దిగిన మేఘారెడ్డి ఆయనకు పలు ప్రశ్నలు సంధించారు. గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని చిన్నారెడ్డికి అసెంబ్లీ టికెట్ ఎలా దక్కిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడుసార్లు పోటీ చేసేందుకు ఆయన ఎవరికి డబ్బులు ముట్టజెప్పారో బహిర్గతం చేయాలని కోరారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ నాయకుల పనులు చేయాలని చిన్నారెడ్డి ప్రభుత్వ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, వారికి స్వయంగా ఫోన్లు చేస్తున్నారని మేఘారెడ్డి గట్టిగా ఆరోపించారు.

### అధిష్ఠానానికి, సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసేందుకు సన్నాహాలు

ఈ వివాదం మరియు చిన్నారెడ్డి వ్యవహారశైలిపై ఏఐసీసీ, పీసీసీ, పార్టీ క్రమశిక్షణ సంఘంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పక్కా ఆధారాలతో సమగ్ర

## ఆ భూములను లాక్కుంటే.. చూస్తూ ఊరుకోం.. రేవంత్ సర్కార్‌కు కవిత వార్నింగ్

హైదరాబాద్, ఆగస్టు 18 : తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈరోజు (మంగళవారం ) హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

### విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టారు..

విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన అడ్వైజర్ల జీతాల విషయంలోనే సామాజిక న్యాయం ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం ఆటవికా న్యాయమా..? అని ప్రశ్నించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఓ రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా..? ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం.? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

### రేవంత్‌రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్..





రేవంత్‌రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని కవిత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చారని.. ఆ తర్వాత ఆపేశారని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి – పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత హితవు పలికారు.

## దసరాలోగా మిషన్ భగీరథ పనులు పూర్తి చేస్తాం



హైదరాబాద్,గత పదేళ్లలో సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. మిషన్ భగీరథ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా అనేక గ్రామాలకు తాగునీరు అందలేదని విమర్శించారు.

### మిషన్ భగీరథ పనులకు పరిశీలించిన ప్రభుత్వ విప్..

మంగళవారం శామీర్‌పేట మండలంలోని ఘన్‌పూర్‌గుట్ట మిషన్ భగీరథ పనులను భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. అధికారులతో పాటు కాంట్రాక్టర్లను పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 1,212 కోట్లతో దాదాపు 2,030 గ్రామాలకు నీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులు పూర్తికాకపోవడంతో సుమారు 1,400 గ్రామాలకు నీరు అందలేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీరు, సాగునీటికి పెద్దపీట వేస్తోందన్నారు.

### దసరా నాటికి తాగునీటి సరఫరా..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , ఉత్తమ్ కుమార్ సహకారంతో ఢిల్లీకి వెళ్లి రూ. 210 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. 16 కిలోమీటర్ల మేర సాగునీరు అందించాల్సిన పనుల్లో గతంలో జాప్యం జరిగిందని, ప్రస్తుతం 11 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన నాలుగు కిలోమీటర్లకు అటవీశాఖ అనుమతులు తీసుకున్నామని, పనులను వేగవంతం చేసి దసరాలోగా ఆలేరు, భువనగిరి, మేడ్చల్ ప్రాంతాలకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి రోజుకు 100 లీటర్ల తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

### వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు..

గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. అంతకు ముందు అలియాబాద్ మున్సిపల్ ఛైర్పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో వాదీజ జిల్లా చైర్మన్ రవి ముదిరాజ్, మాజీ మార్కెట్ కమిటీ సత్యనారాయణ అలియాబాద్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రమేష్,, డివిజన్ అధ్యక్షులు చాప రాజు, నాయకులు అశోక్ రెడ్డి ,రాజు నాయక్ ,సంతోష్ గౌడ్ , నారాయణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి

హైదరాబాద్,22ఏ నిషేధిత భూముల జాబితాలో లక్షల కోట్ల విలువైన ప్రైవేటు భూములు, ప్రజల ఆస్తులను చేర్చిడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పొరపాటు జరిగిందని క్షమాపణలు చెబితే సరిపోదని, నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీశ్ రావు డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరిలో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. నిషేధిత జాబితాలో ప్రజల ఆస్తులను చేర్చి అధికారులు తప్పు చేశారని మంత్రి పొంగులేటి తప్పించుకోచూస్తున్నారని ఆరోపించారు. ఇంకోవైపు మంత్రి చెబితేనే తాము ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టామని అధికారులు చెబుతున్నారని, అసలు 22ఏలో ఆ భూములను చేర్చమన్నది ఎవరో తేల్చాల్సి ఉందని హరీశ్ రావు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లుకూడా నిషేధిత జాబితాలో పెట్టారని, అందుకే రేవంత్ రెడ్డికి పొంగులేటి క్షమాపణ చెప్పాడే తప్ప ప్రజలకు కాదని..తన ఇల్లు నిషేధిత జాబితాలో నుండి తీసేయాలని రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసాడా? మరి ప్రజలు ఎందుకు దరఖాస్తు చేసుకోవాలి? అని హరీశ్ రావు నిలదీశారు. తప్పు చేసింది మంత్రి పొంగులేటి అయినందునా..తప్పులు సరిదిద్దాల్సిన బాధ్యత కూడా ఆయనదేనన్నారు. రాష్ట్రంలో 22ఏ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. ఎవరి భూమి 22ఏ జాబితాలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు అని గుర్తు చేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఏ జాబితాలో పెట్టడం ఏ రకమైన న్యాయం అని, ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనం అని హరీశ్ రావు విమర్శించారు.

### బీఆర్ఎస్ భారీ ఉద్యమం





22ఏ నిషేధిత జాబితాలో పెట్టిన ప్రజల భూములు, ఆస్తులను తొలగించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఉద్యమం చేపడతాం అని హరీశ్ రావు ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా, మా జనతా గ్యారేజ్ (తెలంగాణ భవన్) తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని, మీ భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించే వరకు బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుందని, మీకు ఏ ఇబ్బంది వచ్చినా, ఎవడు మిమ్మల్ని 30% కమీషన్ అడిగినా మీకు అండగా జనతా గ్యారేజ్, మా పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ చేసిన తప్పుకు ప్రజలు శిక్ష అనుభవించాలా? 20 ఏళ్ల నుండి లేని సమస్య రాత్రికి రాత్రి ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ ప్రభుత్వం భూములను 22ఏ నిషేధిత జాబితాలో ఎందుకు పెట్టింది? 60 ఏళ్ల నుండి ఉంటున్న ఇల్లును 22ఏ నిషేధిత జాబితాలో పెట్టారని హరీశ్ రావు నిలదీశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఏలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకని ప్రశ్నించారు. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ఏ నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి? కమీషన్ల కోసమేనా అని హరీశ్ రావు నిలదీశారు. అసలు ఈ ప్రాపర్టీలను 22ఏలో ఎవరు పెట్టారు? కమీషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

## వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదములు : సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఆగస్టు 18: హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ. 1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్‌ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఇవాళ్టి(మంగళవారం) నుంచి ఈ పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నాము. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నాము' అని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

### బాలికల జూనియర్ కళాశాల లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

దేవరకొండ, దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్న భాస్కర్ బాలికల పట్ల అసభ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్వీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్ ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

## మీలా బుకాయించలేదు...తప్పులను సవరిస్తాం : మంత్రి పొంగులేటి



హైదరాబాద్,మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి,నిజాయితీ, నిబద్ధత ఉందని అందువల్లే 22ఏ నిషేధిత భూముల జాబితాలో తప్పు జరిగితే అంగీకరించామని..ధరణితో అక్రమాలు చేసి మీ మాదిరిగా మేం దబాయించడం లేదని..జరిగిన తప్పులకు ప్రజలకు క్షమాపణలు చెప్పి.. తప్పులను సవరిస్తామని ప్రకటించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీశ్ రావు కు స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. ప్రజల ఆస్తులను 22ఏలో ఉద్దేశపూర్వకంగానే పెట్టి వాటిని రిలీజ్ చేయడానికి డబ్బులు వసూలు చేయడానికే ఈ తతంగాన్ని నడుపుతున్నారంటూ హరీశ్ రావు చేసిన ఆరోపణలపై మంత్రి పొంగులేటి స్పందించారు. హరీశ్ రావు కాదు ఆయన అబద్ధాలరావుగా మారారని ఎద్దేవా చేశారు. పొరపాటు జరిగిందని నేనే స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి చెప్పానని, 22ఏ లో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు హరీశ్ రావు తీరు ఉందని విమర్శించారు. ధరణి మూలంగా ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటే స్పందించని బీఆర్ఎస్ పాలకులకు మా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన చేస్తున్న క్రమంలో జరిగిన పొరపాటుకు అధికారుల పక్షాన మేం క్షమాపణ కూడా అడిగానని, మీ పాలనా తప్పులకు ఏనాడైనా మీరు ప్రజలను క్షమాపణ కోరారా? అని పొంగులేటి ప్రశ్నించారు.



## సంపాదకీయం

బుధవారం 19-08-2026

# ఎన్డీయేకు ఊపిరి...

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నేషనల్ డెమొక్రటిక్ అలైన్స్ ప్రభుత్వం, పాలనను మరింత సమర్ధవంతంగా, మిత్రపక్షాల మధ్య ఎటువంటి మనస్పర్ధలు లేకుండా నడిపించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గతంలో ఎన్డీఏ ఉన్న కన్వీనర్ వ్యవస్థను పునరుద్ధరించాలని బీజేపీ భావిస్తోంది. ఈ ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ సానుకూలంగా స్పందించి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. 2024లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్‌ను దాటలేకపోయింది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం 293 మంది ఎంపీల మద్దతుతో నడుస్తోంది. ఇందులో తెలుగుదేశం పార్టీ 16 సీట్లు, జనతాదళ్ యునైటెట్12 సీట్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. పదేళ్లలో బీజేపీకి సొంతంగా మెజారిటీ ఉండటంతో నిర్ణయాలన్నీ ఏకపక్షంగా సాగాయి. కానీ ఇప్పుడు సమ్మతి రాజకీయాల కాలం నడుస్తోంది. మిత్ర పక్షాల డిమాండ్లు, రాష్ట్రాల ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వ విధానాల మధ్య సరైన కమ్యూనికేషన్ ఉండేలా చూడటమే ఈ కన్వీనర్ నియామకం వెనుక ఉన్న ఉద్దేశం. అత్యున్నత బాధ్యతాయుతమైన పదవికి ఇద్దరు సీనియర్ నాయకుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇందులో మొదటి పేరు చంద్రబాబు నాయుడు. దశాబ్ధాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు జాతీయ స్థాయిలో బలమైన నెట్‌వర్క్ ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ వంటి కూటములను నడిపించిన చారిత్రక అనుభవం ఆయన సొంతం. దక్షిణాది, ఉత్తరాది పార్టీలతో ఆయనకు ఉన్న సత్సంబంధాలు కూటమికి అదనపు బలం ఇస్తాయని బీజేపీ భావిస్తోంది. రెండో పేరు నితీష్ కుమార్. హిందీ హార్ట్‌లాండ్‌గా పిలిచే ఉత్తర భారత్ రాజకీయాల్లో నితీష్ కుమార్ మాస్టర్ మైండ్. బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం, ఇతర ప్రాంతీయ పార్టీలతో సమన్వయం చేయగల నైపుణ్యం ఆయనకు ఉన్నాయి. ప్రధాని మోదీతో ఆయనకు ఉన్న ప్రత్యేక అనుబంధం కూడా ఇక్కడ కలిసి వచ్చే అంశం. ఢిల్లీలో త్వరలోనే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మెగా సమావేశం జరగనుంది. ప్రధాని మోదీ ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినందున, ఈ సమావేశంలోనే అధికారికంగా కన్వీనర్ పేరును ప్రకటించే అవకాశం ఉందని పొలిటికల్ సర్కిల్స్ చెబుతున్నాయి.ఎన్డీయే కన్వీనర్‌గా ఎన్నికయ్యే వ్యక్తి కేవలం ఒక ప్రతినిధి మాత్రమేకాదు. కూటమిలోని అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే వారధిగా వ్యవహరిస్తారు. మిత్రపక్షాల మధ్య వచ్చే చిన్నపాటి విభేదాలను చర్చల ద్వారా ప్రాథమిక దశలోనే పరిష్కరించాలి. ఉభయ సభల్లో బిల్లులు పాస్ చేసే సమయంలో భాగస్వామ్య పక్షాలన్నీ ఒకే మాటపై ఉండేలా చూడాలి. వివిధ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటును సజావుగా పూర్తి చేయడం వీరి విధి. ఈ ప్రతిష్టాత్మక నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్ పదవికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో పాటు, జేడీయూ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పేర్లు జాతీయ స్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి. గతంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాలను నడిపించిన అపార అనుభవం, ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన ట్రాక్ రికార్డ్ ఉన్న చంద్రబాబు వైపు మెజారిటీ పార్టీలు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోందిఅయితే కూటమిలోని అందరు భాగస్వామ్య నేతలతో చర్చించి, అందరికీ ఆమోదయోగ్యుడైన మరో సీనియర్ నేత పేరును కూడా పరిశీలించే అవకాశం లేకపోలేదు. కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ రాష్ట్రాల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, కూటమి పార్టీల మధ్య ఎప్పటికప్పుడు చర్చలు జరపడానికి ఒక ప్రత్యేక యంత్రాంగం అవసరమని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే జరగబోయే ఎన్డీయే అగ్రనేతల ప్రత్యేక భేటీలో ఈ కన్వీనర్ నియామకంపై అధికారికంగా ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాలు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో ఈ పదవి చాలా కీలకం కానుంది. రాష్ట్రాల్లోని సమస్యలై నేరుగా కేంద్రమంత్రులు, హోంమంత్రితో చర్చించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

# ‘సప్తధార’ సాకారమైతేనే ప్రగతి



న్యూఢిల్లీ,ఆగస్టు 15న ఢిల్లీ ఎర్రకోటపై ప్రధాని మోడీ 13వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఈసారి ఎలా ఉంటుందో అని అందరూ ఆసక్తిగా నిరీక్షించారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆందోళనల తరువాత, ప్రభుత్వం అనుసరించే సాధారణ వైఖరి ఏమిటో ఈ ప్రసంగంద్వారా అంచనా వేయాలని భావించారు. సిజెపి, జెన్‌జెడ్ నిరసనలు, వాటికి దారితీసిన అంతర్లీన కారణాలు, ఇంకా కొనసాగుతున్న అసంతృప్తి, దేశానికి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలు గానే మిగిలాయి. 75 నిమిషాల ఆయన ప్రసంగంలో రెండు ప్రధాన అంశాలు స్పష్టంగా కనిపించాయి. మొదటిది వామపక్షాలు, ఉద్యమ కార్యకర్తలు, వామపక్ష సిద్ధాంత మేధావులపట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడానికి సిద్ధంగా లేదనే సంకేతం అందించారు. సాయుధ నక్సలైట్లను ఓడించినా, నక్సలైట్ భావజాలం ఇంకా మిగిలే ఉందన్నారు. ఈ సందర్భంగా ‘దిమాగీ నక్సల్స్ ’ అనే కొత్త భూతాన్ని తెరపైకి తెచ్చారు. అలాంటి వ్యక్తులను వ్యవస్థ నుంచి ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ శక్తులు అవకాశాల కోసం చూస్తున్నాయని, హింస, అరాచకానికి దారితీసే మార్గాలను అన్వేషిస్తూ సమాజాన్ని తప్పుదారి పట్టించేందుకు వివిధ వ్యూహాలను అవలంబిస్తున్నాయని హెచ్చరించారు.మరోవైపు యువత ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఆశలు కలిగించేలా సప్తధార పేరున ఏడు ప్రధాన లక్షాలను వెల్లడించారు. ఈ ప్రసంగం ప్రత్యేకంగా దేశంలోని యువ పౌరులను ఉద్దేశించి చేసింది. పెద్ద కలలు కనడం, దృఢమైన సంకల్పంతో ముందుకు సాగడం, వేగంగా అమలు చేయడం అవసరమని స్పష్టం చేశారు. దేశాన్ని కృత్రిమ మేధస్సు (ఎఐ) యుగానికి సిద్ధం చేయడానికి వచ్చే ఏడాదిలో ఒక కోటి మంది యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు అందేలా పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. అలాగే ఆవిష్కరణలు, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష రంగం, రోబోటెక్స్, డేటా సెంటర్లు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రక్షణ పరికరాల ఉత్పత్తిలో భారత్‌ను స్వావలంబన దిశగా తీసుకెళ్లాలనే తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఇందులో డ్రోన్లు, తదుపరి తరం రక్షణ వ్యవస్థలు వంటి అత్యంత ఆధునిక సాంకేతికతల అభివృద్ధి కూడా భాగమని పేర్కొన్నారు. ఈ హామీలు భవిష్యత్‌పై స్పష్టమైన లక్షాలుగా, దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని, ప్రతి భారతీయుడు సహజంగానే అభినందిస్తారు. అయితే ఈ లక్షాలను, సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన జాతీయ విధానాన్ని రూపొందించాలని ప్రధాని మోడీ కోరుకున్నారా లేదా అందుకు ప్రయత్నించారా అన్నది సందేహాస్పదమే.దేశంలో అభివృద్ధి అన్నది నిరంతర ప్రక్రియ. ప్రతి సంవత్సరం సాధించిన పురోగతి, తరువాతి సంవత్సరాల్లో మరింత వేగంగా పెరుగుతూ, సమ్మిళిత ప్రభావాన్ని చూపించగలగాలి. 2014లో ప్రధానమంత్రిగా మోడీ బాధ్యతలు చేపట్టడానికి ముందు, తరువాత సాధించిన విజయాలను కేవలం సంపూర్ణ సంఖ్యల ఆధారంగా సరిపోల్చడం గణాంకపరంగా అంత సముచితం కాదు. రాజకీయంగా కూడా అది వివేక బద్ధతను ప్రశ్నిస్తుంది. బ్రిటిష్ వలస పాలనను ఎదుర్కొని భారత్ ఇప్పుడు స్వతంత్ర దేశంగా 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఇది వరకటి కన్నా మునుపెన్నడూ లేని అసాధారణమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. ఒకవైపు భారీ సంఖ్యలో యువజనాభా ఉపాధి రంగంలోకి ప్రవేశిస్తోంది. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం గతంలో ఎన్నడూ లేనంతగా మన జీవన విధానాన్ని, పనితీరును మార్చివేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత దేశానికి అందరూ కలిసికట్టుగా పనిచేసే సమగ్ర విధానం అత్యంత అవసరం. ఎన్నికల్లో గెలవడానికి పోటాపోటీలు, రాజకీయ ప్రయోజనాలు, వీటన్నిటికి అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య ఏకాభిప్రాయంతో కూడిన రాజకీయ సంకల్పం అవసరం. దేశం ఎదుర్కొంటున్న ఈ అసాధారణ సవాళ్లను అధిగమించడానికి, అందరూ ఒకే దిశగా, అన్ని చేతులూ కలిసి పనిచేసే విధానం చాలా ముఖ్యం.అభివృద్ధి చెందిన దేశాలను ఇప్పుడు టెక్నో క్యాపిటలిజం కుదిపోస్తోంది. టెక్నో క్యాపిటలిజం అనేది సాంకేతికత, పెట్టుబడి దారీ వ్యవస్థ కలగలసిన ఆధునిక ఆర్థిక సామాజిక వ్యవస్థ. ఈ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో టెక్నాలజీ, డేటా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రధాన శక్తులుగా మారి నియంత్రిస్తుంటాయి. దీనివల్ల అధిక లాభాలు కొద్ది కంపెనీలు, పెట్టుబడిదారుల వద్ద ఎక్కువగా కేంద్రీకృతం కావచ్చు. ఈ టెక్నో క్యాపిటలిజాన్ని అనుకరించడానికి ప్రయత్నించకుండా మనదేశ పరిస్థితులు, అవసరాలు, విలువలకు అనుగుణంగా స్వంత అభివృద్ధి నమూనాను రూపొందించుకోవాలి. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఇదే అంశాన్ని గుర్తుచేశారు. ఈ సవాళ్లను ప్రధాని మోడీ స్పష్టంగా గుర్తిస్తున్నా, తనను విమర్శించే వారిని శత్రువులుగా పరిగణిస్తున్నట్టు కనిపిస్తోంది. విభజనకు దారి తీసే విభేదాల అగాధాలను మరింతగా పెంచడం కంటే, భిన్నాభిప్రాయాలను వినడం, వాటిని అవగాహన చేసుకోవడం వంటి పద్ధతులను ఆచరణలోకి తీసుకొచ్చినప్పుడే మరిన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఎర్రకోట సాక్షిగా ప్రధాని మోడీ ప్రకటించిన హామీలు, మెరుగైన విద్య, మంచి ఉద్యోగాలు, అధిక ఆదాయాలు, ఆర్థిక ప్రగతి అవకాశాలుగా మారకపోతే అవి కేవలం రాజకీయ వాగ్దానాలుగానే మిగిలిపోతాయి. వామపక్ష భావ జాలాలకు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయంగా అవి నిలవలేవు.

# సభలో మాట తప్పితే... సరిదిద్దే నాయకత్వం కూడా ఉండాలి!



చెన్నై:తమిళనాడు అసెంబ్లీలో తాజాగా జరిగిన ఒక చిన్న సంఘటన పెద్ద సందేశాన్ని ఇచ్చింది. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిని ప్రస్తావించిన తీరు పట్ల ప్రతిపక్ష డీఎంకే సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ముఖ్యమంత్రి విజయ్ వెంటనే జోక్యం చేసుకున్నారు. తన మంత్రి ఉపయోగించిన సంబోధన సరైంది కాదని అంగీకరిస్తూ ప్రతిపక్షానికి క్షమాపణ చెప్పారు.ఒక ముఖ్యమంత్రి తన మంత్రిని సమర్థించడానికి ప్రయత్నించకుండా, సభలో తప్పు జరిగిందని భావించిన వెంటనే దాన్ని సరిచేయడానికి ముందుకు రావడం రాజకీయంగా చిన్న సంఘటన కావచ్చు. కానీ శాసనసభల ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఇందులో ఆలోచించాల్సిన విషయం చాలా ఉంది.తమిళనాడు అసెంబ్లీ చరిత్ర ఎప్పుడూ ఇంత హుందాగా సాగిందని చెప్పలేం. 1989 మార్చి 25న జరిగిన సంఘటన భారత శాసనసభల చరిత్రలోనే అత్యంత చేదు ఘటనల్లో ఒకటిగా మిగిలిపోయింది. అప్పటి ప్రతిపక్ష నాయకురాలు జయలలిత, ముఖ్యమంత్రి కరుణానిధి మధ్య తీవ్ర వాగ్వాదం తర్వాత సభలో గందరగోళం చెలరేగింది. బడ్జెట్ పత్రాలు, పుస్తకాలు విసురుకునే స్థాయికి పరిస్థితి వెళ్లింది.తనపై దాడి జరిగిందని, తన చీరను లాగారని జయలలిత అనంతరం ఆరోపించారు. డీఎంకే నాయకులు ఆ ఆరోపణను ఖండించారు; ఆ రోజు సభలో ఉన్నవారి వాంగ్మూలాల్లో కూడా వివరాలపై భిన్నమైన కథనాలు ఉన్నాయి. కానీ ఒక మహిళా ప్రతిపక్ష నాయకురాలు తీవ్ర అవమానానికి గురయ్యానని చెబుతూ సభ నుంచి బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నది మాత్రం తమిళనాడు రాజకీయ చరిత్రలో చెరగని అధ్యాయంగా మిగిలింది.ఆ స్థాయి రాజకీయ శత్రుత్వాన్ని చూసిన తమిళనాడులో ఇటీవలి సంవత్సరాల్లో సభా వ్యవహారాల్లో కొంత మార్పు కనిపించడం గమనించాల్సిన విషయం. స్టాలిన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కూడా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ విమర్శలు జరిగాయి. గవర్నర్‌తో ఘర్షణలు జరిగాయి. సిద్ధాంతపరమైన వివాదాలు కొనసాగాయి. అంటే తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా స్నేహపూర్వకంగా మారిపోయాయని చెప్పలేం. కానీ రాజకీయంగా ఎంత విభేదించినా సభ గౌరవాన్ని కాపాడాలనే చర్చ మాత్రం బలంగా కొనసాగింది. 2026లో కొత్త స్పీకర్ ఎన్నికైనప్పుడు కూడా సభ గౌరవాన్ని కాపాడాలని, ప్రతిపక్ష స్వరం వినిపించేలా చూడాలని మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేకంగా కోరడం అదే ప్రజాస్వామ్య స్ఫూర్తిని గుర్తుచేస్తుంది.ఇప్పుడు విజయ్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన తాజా సంఘటనను కూడా అదే కోణంలో చూడాలి. తన పార్టీకి చెందిన మంత్రి అన్న మాటను ముఖ్యమంత్రి తప్పనిసరిగా సమర్థించాల్సిన అవసరం లేదని విజయ్ చూపించారు. “మనవాడు అన్నాడు కాబట్టి సరైనదే” అనే రాజకీయ ధోరణికి బదులుగా, తప్పు అనిపిస్తే సభలోనే సరిచేయడం ఒక మంచి సంప్రదాయం. అయితే ఒక్క క్షమాపణతోనే ఒక ప్రభుత్వానికి లేదా నాయకుడికి ప్రజాస్వామ్య హుందాతనం అనే సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదు. అదే ప్రమాణాన్ని ఐదేళ్లపాటు అధికారపక్షానికీ, ప్రతిపక్షానికీ సమానంగా పాటించినప్పుడే అది నిజమైన సభా సంస్కృతిగా మారుతుంది.ఇక్కడ మన తెలుగు రాష్ట్రాల శాసనసభల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ప్రతిపక్షంలో ఏ పార్టీ ఉన్నా వ్యక్తిగత విమర్శలు, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం, అవమానకరమైన సంబోధనలు, సభలో తీవ్ర వాగ్వాదాలు రాజకీయ చర్చను పలుమార్లు అసలు ప్రజా సమస్యల నుంచి పక్కదారి పట్టించాయి. దీనిని ఒక పార్టీ సమస్యగా చూపించడం కూడా సరైంది కాదు.ప్రభుత్వం మారినప్పుడు పాత్రలు మారుతున్నాయి; నిన్న విమర్శించిన వారు ఈరోజు అధికారంలో ఉండవచ్చు, నిన్న అధికారంలో ఉన్నవారు ఈరోజు ప్రతిపక్షంలో ఉండవచ్చు. కానీ భాష, వ్యక్తిగత దాడుల విషయంలో ప్రమాణం మాత్రం మారకూడదు.తెలంగాణ అసెంబ్లీలో కూడా తీవ్ర రాజకీయ వాగ్వాదాలు లేవని చెప్పలేం. అక్కడ కూడా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు, సస్పెన్షన్లు, నిరసనలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే ఏ రాష్ట్రాన్ని ఆదర్శంగా, మరో రాష్ట్రాన్ని పూర్తిగా చెడ్డదిగా చిత్రీకరించడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. అసలు ప్రశ్న మన శాసనసభల్లో రాజకీయ విభేదాలను వ్యక్తిగత అవమానాలుగా మార్చకుండా ఆపే వ్యవస్థ ఎంత బలంగా ఉంది? అన్నది.అక్కడే స్పీకర్ పాత్ర అత్యంత కీలకమవుతుంది. స్పీకర్ ఒక పార్టీ నుంచి ఎన్నికవుతారు. కానీ ఆ కుర్చీలో కూర్చున్న తర్వాత ఆయన కేవలం అధికారపక్ష సభ్యుడు కాదు; మొత్తం సభకు సంరక్షకుడు. అధికారపక్ష సభ్యుడు హద్దు దాటినా ఆపాలి. ప్రతిపక్ష సభ్యుడు హద్దు దాటినా అదే ప్రమాణంతో ఆపాలి. అనుచితమైన వ్యాఖ్య రికార్డుల్లోకి వెళ్లకుండా చూడాలి. అవసరమైతే ఉపసంహరించుకోవాలని చెప్పాలి. పరిస్థితి మరింత దిగజారకముందే జోక్యం చేసుకోవాలి.ఒకప్పుడు శాసనసభల్లో స్పీకర్ హెచ్చరిస్తే అధికారపక్ష సభ్యుడు కూడా కూర్చోవాల్సిన పరిస్థితి ఉండేది. ఎందుకంటే ఆ కుర్చీకి ఒక సంస్థాగత గౌరవం ఉండేది. ఇప్పుడు చాలా రాష్ట్రాల్లో స్పీకర్ నిర్ణయాలను కూడా అధికారపక్షం, ప్రతిపక్షం అనే రాజకీయ కళ్లద్దాలతోనే చూసే పరిస్థితి ఏర్పడితే అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. స్పీకర్ అధికారపక్షానికి రక్షణ కవచం కాకూడదు; ప్రతిపక్షానికి శిక్ష విధించే అధికారి కూడా కాకూడదు. సభా నియమాలకు కాపలాదారుగా ఉండాలి.బాధ్యత ముఖ్యమంత్రి, స్పీకర్ దగ్గరే ఆగిపోదు. ప్రతిపక్ష నాయకుడికీ అంతే బాధ్యత ఉంది. తన సభ్యుడు హద్దు దాటితే “మన పార్టీ వ్యక్తి కాబట్టి” సమర్థించకుండా తప్పు అని చెప్పగలగాలి. రాజకీయ ప్రత్యర్థిని ఓడించడం ఒక విషయం; వ్యక్తిగతంగా అవమానించడం మరో విషయం. విధానాన్ని విమర్శించవచ్చు, అవినీతిని ఆధారాలతో ప్రశ్నించవచ్చు, ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టవచ్చు. కానీ కుటుంబాలు, వ్యక్తిగత జీవితం, ప్రాంతం, కులం, భాష, వస్త్రధారణ వంటి అంశాలను రాజకీయ ఆయుధాలుగా మార్చినప్పుడు సభ తన స్థాయిని కోల్పోతుంది.ఇందులో ప్రజల పాత్ర కూడా చిన్నది కాదు. సభలో ఎవరో ఒక నాయకుడు అవమానకరమైన మాట మాట్లాడితే దాన్ని వీడియోగా కట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తాం. మనకు నచ్చని నాయకుడిని అవతలి వ్యక్తి తిట్టాడంటే ఆనందంతో షేర్ చేస్తాం. మన పార్టీ నాయకుడు హద్దు దాటితే “సూపర్ కౌంటర్” అంటాం. ప్రత్యర్థి అదే పని చేస్తే “సభా సంస్కృతి నాశనం” అంటాం. రాజకీయ నాయకులకు ఏ రకమైన ప్రవర్తనకు ఎక్కువ చప్పట్లు వస్తాయో వారు కూడా గమనిస్తారు. మనం అవమానానికి చప్పట్లు కొడితే రాజకీయాల్లో అవమానమే పెరుగుతుంది.అందుకే మార్పు సభలో మాత్రమే రావడం సాధ్యం కాదు. మన నాయకుడు తప్పు మాట్లాడినా తప్పే అని చెప్పగలిగే రాజకీయ పరిపక్వత ఓటరులో కూడా రావాలి. ప్రత్యర్థిని గౌరవించడం అంటే అతని రాజకీయాలతో ఏకీభవించడం కాదు. సభా మర్యాదను కోరడం అంటే రాజకీయ పోరాటాన్ని బలహీనపరచడం కూడా కాదు. నిజానికి బలమైన ప్రజాస్వామ్యంలో వాదన ఎంత తీవ్రంగా ఉంటుందో, భాష అంత హుందాగా ఉండాలి.తమిళనాడు అసెంబ్లీలో విజయ్ చెప్పిన చిన్న “క్షమించండి” అందుకే పెద్ద విషయంగా కనిపిస్తోంది.

# కూటమిలో ఏం జరుగుతోంది

విజయవాడ, తెలుగు రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత , పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యత చేపట్టడం ఆయన అభిమానులకు గర్వ కారణం. అయితే పవన్ కళ్యాణ్ కేవలం ఆ పదవి ని అలంకరణ కోసం వాడుకోకుండా, తానూ బాధ్యత చేపట్టిన శాఖలకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నాడు. వైసీపీ పార్టీ ప్రభుత్వ హయాం లో 24 వ స్థానం లో ఉన్న ఈ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకుందంటే పవన్ కళ్యాణ్ పని తీరు ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామా సభలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని ప్రజలు చేత వాళ్లకు అవసరమయ్యే పనులన్నీ కలెక్టర్ల దృష్టికి చేర్చి, పల్లె పండుగ పేరుతో రెండు విడతల్లో పవన్ కళ్యాణ్ ఈ స్థాయి ఫలితాలను అందుకున్నాడు.అభిమానులు ఎంతసేపు సినిమా ఫ్యాన్ వార్స్ లో దూరి రికార్డ్స్ కోసం కొట్లాడుకోవడం కాకుండా, ఇలాంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్తే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ ఎక్కడికో వెళ్తుంది అంటూ సోషల్ మీడియా లో రాజకీయ విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యం లో ప్రతీ ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సేతత్ వికాస్ జాతీయ సంస్థ గ్రామీణాభివృద్ధి, నీటి సంరక్షణ , పారిశుద్యం విభాగాల్లో పురస్కారాలను అందిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పంచాయితీ రాజ్ శాఖ లో అవార్డులు అందుకుంది. ఇప్పుడు వరుసగా రెండవసారి కూడా అవార్డులను అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం అయితే పంచాయితీ రాజ్ శాఖ ఏకంగా 5 విభాగాల్లో అత్యుత్తమ ర్యాంక్ అందుకుంది. గుడ్ గవర్నెన్స్ విభాగం లో శృంగవరం పంచాయత్ మొదటి స్థానం లో నిలబడింది.అదే విధంగా వుమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ గా బొక్కాసం పాలెం అనే గ్రామం కూడా మొదటి స్థానం లో నిల్చింది. పేదరికం లేని గ్రామంగా, అత్యంత ప్రమాణాలతో జీవనం సాగుతున్న గ్రామం గా చెమ్ములపల్లి పంచాయత్ 2 వ స్థానం లో కొనసాగుతుండగా, సెల్ఫ్ సఫీషియంట్‌న్ఫ్రా స్ట్రక్చర్ విభాగం లో గుండుమల పంచాయత్ 3వ ర్యాంక్ లో కొనసాగుతుంది. ఇక ఉత్తమ మండలం విభాగం లో అయితే కుప్పం దేశం లోనే 3 వ ర్యాంక్ సాధించింది. ఇలా పవన్ కళ్యాణ్ ఆద్వర్యం లో పంచాయితీ రాజ్ శాఖ ఎప్పుడూ చూడనంత అభివృద్ధిని చూస్తూ దేశంలోనే మన ఆంధ్ర ప్రదేశ్ ని ఆదర్శవంతమైన రాష్ట్రము గా తీర్చి దిద్దాడు పవన్

# ముదురుతున్న వందే మాతరం వివాదం

లక్నో, జాతీయ గేయం వందేమాతరం ఆలాపన విషయంలో కాంగ్రెస్ వివాదంలో ఇరుక్కుంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలపై దుమారం రేగింది. జాతీయ పతాక ఆవిష్కరణ సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలాపించకుండా, ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని, ఆపేయమన్నారని విమర్శలు వచ్చాయి. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి, ఆ పార్టీ నేతలకు, జాతీయ అధ్యక్షుడికి పూర్తి వందేమాతరం ఆలాపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని బీజేపీ విరుచుకుపడుతోంది. కొందరి ఆలోచనా ధోరణి 1947 కి పూర్వం ఎలా వుందో ఆ తర్వాత అలాగే వుందని కూడా విరుచుకుపడుతున్నారు.అలాగే రాజకీయాలకు అతీతులైన వ్యక్తులు కూడా ఈ పరిణామంపై స్పందిస్తున్నారు.బంకిం చంద్ర చటోపాధ్యాయ వారసుడైన సుమిత్రో చటర్జీ కూడా స్పందించారు. జాతీయ గీతం ప్రసారమవుతుండగా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తమలో తాము మాట్లాడుకోవడం తన కుటుంబాన్ని “బాధించిందని” ఆయన పేర్కొన్నారు.అయితే ఈ విమర్శలను కాంగ్రెస్ ఖండిస్తోంది.“వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న సమయంలో ఖర్గే నిలబడి ఉన్నారు.. ఆయనకు కుర్చీ వేయాలని మాత్రమే సోనియా సైగ చేశారు. అంతేకానీ.. పూర్తిగేయాన్ని ఆపేయాలని ఆమె కోరలేదు.” అని కాంగ్రెస్ వివరించింది. ఈ వివాదంపై స్పందించిన సీనియర్ నేత జైరాం రమేశ్.. “1937, అక్టోబరు 28న కోల్‌కతాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో వందేమాతరం గేయంలోని ప్రారంభ చరణాలను మాత్రమే ఆలపించాలని మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, రవీంద్రనాథ్‌ఠాగూర్ వంటి పెద్దలు నిర్ణయించారు.” అని గుర్తు చేశారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రతికార్యక్రమంలోనూ వందేమాతరం ఆలపిస్తోందని, దీనిపై వివాదం లేదని, వారు సృష్టించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించామని తెలిపారు.

# తీరుమారని యూజీసీ నెట్ ఎగ్జామ్ రద్దు

న్యూఢిల్లీ,యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి ఏకంగా మూడు సబ్జెక్టులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను తిరిగి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మూడు పేపర్లలో పలు తప్పులు, లోపాలు ఉన్నాయంటూ అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జూన్ 2026 పరీక్షలను జూన్ 22 నుంచి 30 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం జూలై 5, 2026న రీ-టెస్ట్ నిర్వహించింది. మొత్తం 87 సబ్జెక్టులకు ఈ పరీక్షలు జరిగాయి. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. అయితే ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ పేపర్లలో అనేక తప్పులు ఉన్నాయని ఔంకు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ లోపాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సమగ్రంగా పరిశీలించిన అనంతరం మూడు పేపర్లలో పలు రకాల తప్పులు ఉన్నట్లు గుర్తించింది.కమిటీ నివేదిక ప్రకారం.. ప్రశ్నపత్రాల్లో ప్రముఖ పండితుల పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, పుస్తకాల పేర్లలో లోపాలు, ప్రశ్నల పదబంధాల్లో తప్పులు, వ్యాకరణ దోషాలు, లింగం-వచన అన్వయంలో పొరపాట్లు, విరామ చిహ్నాల తప్పులు ఉన్నాయి. అంతేకాకుండా ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న భావాలకు ప్రామాణికం కాని పదాలను ఉపయోగించడం, గతంలో అడిగిన ప్రశ్నల్లో గణనీయమైన సంఖ్యలో ప్రశ్నలను మళ్లీ ఇవ్వడం వంటి లోపాలు కూడా ఉన్నట్లు కమిటీ గుర్తించింది. అభ్యర్థులందరికీ న్యాయమైన, లోపాలు లేని పరీక్షను నిర్వహించడం అవసరమని భావించిన కమిటీ.. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ మూడు పేపర్లను తిరిగి నిర్వహించాలని సిఫార్సు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా రీ-కండక్ట్‌కు నిర్ణయం తీసుకుంది.

ఇంగ్లిష్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

కామర్స్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 2, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు

సోషియాలజీ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 10, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఈ మూడు సబ్జెక్టులకు చెందిన అభ్యర్థుల నుంచి రీ-కండక్ట్ పరీక్ష కోసం ఎలాంటి అదనపు పరీక్ష ఫీజు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. పరీక్ష నగరం, పరీక్ష కేంద్రం, అడ్మిట్ కార్డుకు సంబంధించిన వివరాలను తదుపరి దశలో అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తామని తెలిపింది.

# కమల దళంలో కల్లోలం!

## నల్లగొండలో ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభలు

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 36వ జాతీయ మహాసభలను 2026 నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, టి. సాగర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్ వద్ద గల తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహాసభల ప్రచార కరపత్రాలను సంఘ నాయకులు విడుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4,000 మంది అమరులై, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన పోరాటాల పురిటిగడ్డ నల్లగొండలో తొలిసారిగా ఈ జాతీయ మహాసభలు జరుగుతున్నాయి. మహాసభల సందర్భంగా లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నారు. దేశనలుమూలల నుండి 1,500 మంది రైతు ఉద్యమ నేతలు, ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు. రైతు సమస్యలపై చర్చలు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూప కల్పన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, సెమినార్లు ఉంటాయి. అన్ని రకాల పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయడం, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ, విద్యుత్ ప్రైవేటీకరణ నుండి కాపాడటం, ఢిల్లీ రైతు ఉద్యమ సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చడం. నల్లగొండ జిల్లాకు కీలకమైన సొరంగం పనులను త్వరగా పూర్తి చేయడం, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగునీరు అందించడం, మూసీ ప్రాజెక్ట్ ఆధునీకరణ, చెక్ డ్యామ్‌ల నిర్మాణం. బీడు, పోడు భూములకు పట్టాలు, రుణమాఫీ పూర్తిస్థాయి అమలు, రైతు భరోసా నిధుల విడుదల, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించడం. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సాగే ఈ మహాసభలను జయప్రదం చేయడానికి రైతులు, రైతు శ్రేయోభిలాషులు సహకరించాలని తెలంగాణ రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మ్యడ్ శోభన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి, పి. జంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, కందాల ప్రమీల, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శెట్టి వెంకన్న, యం శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అన్నవరపు సత్యనారాయణ, మాటూరి బాలరాజు గౌడ్, పల్లపు వెంకటేష్, కొక్కెరపాటి పుల్లయ్య, భూక్య చందూనాయక్, కొంగరి వెంకట్ మావో, దుబ్బాక రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

బద్వేలు,ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి. ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం. రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది. ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి. నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది. ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి. తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి. 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి. అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది. ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరుపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది. మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది. పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది. ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది. విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు.

## ఆటో కార్మికుల ఉపాధికి పూర్తి రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం


హైదరాబాద్,మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ కేకేసీ యూనియన్ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.మంత్రి మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. వారి సంక్షేమం కోసం త్వరలోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం. ఆటో ఛార్జీల పెంపు కోసం ఆటో కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. 2012లో ఛార్జీలు పెరిగాయి. దాదాపు 14 సంవత్సరాలుగా ఛార్జీల పెంపు జరగలేదు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో పెట్టుకొని వారి ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం పడకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఛార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు.ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసి నడుపుతుందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ఆర్టీసీకి ఎలాంటి ఆలోచన లేదు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయదు. లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడమే మా లక్ష్యం. ఆర్టీసీ, రైల్వే, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను సమన్వయం చేసి ప్రయాణికులకు ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సౌకర్యవంతమైన రవాణా

న్యూఢిల్లీ,ఉప ఎన్నికల ఓటములు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన యువత నిరసనల తర్వాత, బిజెపి వర్గాల్లో ఈ అభిప్రాయం సర్వసాధారణమైంది. ఉప ఎన్నికల ఫలితాలు అగ్రవర్ణాల నుండి వచ్చిన ఒక హెచ్చరిక అని, అది తిరుగుబాటు కాదని చెప్పవచ్చు. ఉప ఎన్నికల్లో అగ్రవర్ణాల ఓట్ల సరళి ఎలా మారింది? నితిన్ నబీన్, అంతకు ముందు ఆయన తండ్రికి కంచుకోటగా ఉన్న బంకీపూర్ ఫలితం నిస్సందేహంగా అత్యంత దిగ్భ్రాంతికరమైనది. కాయస్థ, బ్రాహ్మణ, ఠాకూర్ వర్గాల ఓటర్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ స్థానం, బీహార్‌లో బిజెపికి అత్యంత సురక్షితమైన స్థానాల్లో ఒకటిగా పరిగణిస్తారు.గత పుష్కర కాలంగా బిజెపిలో, ఆ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వాలలో అంతా తామే అయి నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా మొదటిసారిగా పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు వెనుకడుగు వేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో మూడింట రెండు వంతుల మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగానే దేశంలో ఇక తమకు తిరుగులేదని సంబరపడింది. ఈ ఇద్దరు నాయకులు ఎన్నో ప్రణాళికలతో ఈ సమావేశాలకు పూర్వరంగం సిద్ధం చేశారు. టిఎంసి, ఆప్, ఎన్‌సిపి (ఎపి) వంటి పార్టీల ఎంపిలను చీల్చి, పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం ఉత్సాహంగా అడుగులు వేసి, గత ఏప్రిల్‌లో ఓటమిపాలైన పునర్విభజన, మహిళా బిల్లులను తిరిగి తీసుకొచ్చి ఆమోదం పొందేందుకు ఉత్సాహంతో ఉరకలువేశారు. వాస్తవంలో పరిస్థితి తిరగబడింది. వివాదాస్పద బిల్లులను ఈ సమావేశాల్లో ఆమోదించడం అటుంచి యువత ఆందోళనకు తలొగ్గి తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోడీ బలవంతంగా తమ మంత్రినొకరిని పదవినుంచి తప్పించాల్సి వచ్చింది.జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగగా, ఒక్క ఆఖరి రోజు తప్ప ప్రధాని మోడీ, అమిత్ షాలు సభ ముఖం చూడలేదు. ఆఖరి రోజు నామమాత్రంగా హాజరైనా మూగనోము కొనసాగించారు. చిన్నాచితకా బిల్లులు ఆమోదం పొందినా ముఖ్యమైన విదేశీ విరాళాల నియంత్రణ బిల్లును ఆమోదింప చేసుకొనే వీలున్నప్పటికీ సాహసం చేయలేకపోయారు. జెపిసికి పంపి ఊరుకున్నారు. నెంబర్ వన్, టూ నేతలు విపక్షాలు, విద్యార్థులను ఎదుర్కోలేక పార్లమెంట్‌కు ముఖం చాటేసారు. వారిద్దరూ ఇంతగా గందరగోళ పరిస్థితి ఎదుర్కొనేందుకు కేవలం నీట్ పేపర్ లీక్‌పై సిజెపి నిరసనలు మాత్రమేకాదు. ఇదే సమయంలో జరిగిన మూడు అసెంబ్లీ ఉపఎన్నికల ఫలితాలు వారిని ఓ విధంగా దిగ్భ్రాంతికి గురిచేశాయి. మూడు దశాబ్దాలకు పైగా తిరుగులేని విధంగా విజయం సాధిస్తున్న బీహార్‌లో పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీచేసి బంకీపూర్ నుండి ప్రశాంత కిషోర్ గెలుపొందడం వారికి ఓ విధమైన హెచ్చరిక చేసింది. దశాబ్దాలుగా పార్టీకి 'కోర్ ఓటర్లు'గా ఉన్న అగ్రవర్ణాలు ఆ పార్టీ పట్ల ఆగ్రహంతో ఉన్నారని వెల్లడైంది.సిజెపి నిరసనల సమయంలో సైతం రిజర్వేషన్ వ్యతిరేక భావాలు అక్కడక్కడా వ్యక్తంకావడం గమనిస్తే ఆయా వర్గాలు మోడీ, అమిత్ షా విస్తృతంగా ప్రచారం చేస్తున్న 'బిసి, ఒబిసి' ప్రాధాన్యతల పట్ల ఈ వర్గాలు ఆగ్రహంతో ఉన్నారనే సంకేతం ఇచ్చాయి. వాస్తవానికి బిసి, ఒబిసి వర్గాలకు 'అలంకారప్రాయంగా' పదవులు మాత్రమే ఇస్తున్నారు. పార్టీలో, ప్రభుత్వంలో నిర్ణయాత్మక అధికారాలు అన్ని అగ్రవర్ణాలకు చెందిన నాయకుల చేతులలోనే ఉంటున్నాయి. బిజెపికి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నడిపిస్తున్న ప్రధాని కార్యాలయంలోని కీలక అధికారులు అందరూ అగ్రవర్ణాలకు చెందిన వారే. కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రిత్వ శాఖలు చాలావరకు వారి చేతుల్లోనే ఉన్నాయి. అది వేరే విషయం. అయితే, 2014 ముందు పార్టీలో కీలక స్థానాలలో ఉన్న నాయకులు అందరినీ వరుసగా తెరవెనుకకు పంపడం, ఇతర పార్టీలనుండి వచ్చిన, తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులను అందలం ఎక్కిస్తూ ఉండటం పార్టీ 'కోర్ ఓటర్లు'లో తీవ్రమైన అసంతృప్తి, ఆగ్రహం కలిగిస్తోంది.'ఆత్మమంతన్ కా సమయ్' (ఆత్మపరిశీలనకు సమయం) అంటూ ఇటీవలి ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి తర్వాత సీనియర్ బిజెపి నాయకురాలు, మధ్యప్రదేశ్ మాజీ మంత్రి యశోధర రాజే సింధియా 'ఎక్స్' లో చేసిన పోస్ట్ అగ్రనాయకత్వంపై నెలకొన్న ఆగ్రవేశాలను వెల్లడి చేస్తుంది. గ్వాలియర్ రాజకుటుంబానికి చెందిన ఆమె కాబట్టి, ఆ ప్రాంతానికేచెందిన దతియాలో జరిగిన ఓటమి గురించి మాత్రమే ఆమె ఆ వ్యాఖ్య చేశారని భావించే అవకాశం ఉంది. అయితే ఆమె దాతియా ఉపఎన్నిక పాటు బంకీపూర్‌ను కూడా ప్రత్యేకంగా పేర్కొనడంద్వారా, తన దృష్టి జాతీయ స్థాయి అంశాలపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు. ఉప ఎన్నికల ఓటములు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన యువత నిరసనల తర్వాత, బిజెపి వర్గాల్లో ఈ అభిప్రాయం సర్వసాధారణమైంది. ఉప ఎన్నికల




ఫలితాలు అగ్రవర్ణాల నుండి వచ్చిన ఒక హెచ్చరిక అని, అది తిరుగుబాటు కాదని చెప్పవచ్చు. ఉప ఎన్నికల్లో అగ్రవర్ణాల ఓట్ల సరళి ఎలా మారింది? నితిన్ నబీన్, అంతకు ముందు ఆయన తండ్రికి కంచుకోటగా ఉన్న బంకీపూర్ ఫలితం నిస్సందేహంగా అత్యంత దిగ్భ్రాంతికరమైనది. కాయస్థ, బ్రాహ్మణ, ఠాకూర్ వర్గాల ఓటర్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ స్థానం, బీహార్‌లో బిజెపికి అత్యంత సురక్షితమైన స్థానాల్లో ఒకటిగా పరిగణిస్తారు. రాజకీయ వ్యూహకర్త నుండి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ ఈ స్థానాన్ని గెలుచుకోవడం ద్వారా బీహార్ రాజకీయాల్లో ఒక కీలక శక్తిగా ఆవిర్భవించారు. బిజెపి కాంగ్రెస్ మధ్య సంప్రదాయబద్ధంగా గట్టి పోటీ ఉండే మధ్యప్రదేశ్‌లోని దతియా స్థానంలో ఓటమికి కూడా అగ్రవర్ణ ఓటర్ల మద్దతు మారడం, ప్రముఖ బిజెపి నాయకుడు నరోత్తమ్ మిశ్రా మద్దతుదారులలో ఉన్న అసంతృప్తి కారణమని భావిస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బిజెపి అగ్రవర్ణాల అసంతృప్తిని ఎదుర్కొంటోంది.మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం, ఆదాయాలు పెరగకపోవడం అగ్రవర్ణాల అసంతృప్తికి ప్రధాన కారణం. బిజెపి కేవలం కొద్దిమంది పారిశ్రామికవేత్తల గురించి, ప్రభుత్వ ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల ద్వారా లబ్ధి పొందే అత్యంత పేదల గురించి మాత్రమే ఆలోచిస్తుందని అగ్రవర్ణాల వారు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'సాధారణ వర్గాల (జనరల్ కేటగిరీ) కోసం బిజెపి తెచ్చిన చివరి విధానం ఇడబ్ల్యూఎస్ కోటా (జనవరి 2019లో). అది కూడా మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో (2018 అసెంబ్లీ ఎన్నికల సమయం లో) మేము వారికి తగిన గుణపాఠం నేర్పిన తర్వాతే జరిగింది,' అని రిజర్వేషన్ వ్యతిరేక కార్యకర్త ఒకరు పేర్కొన్నారు. అగ్రవర్ణాల వారి అసంతృప్తి కేవలం ఈ ఉప ఎన్నికలకే పరిమితం కాలేదు. పశ్చిమ రాజస్థాన్ రాజకీయాల్లో 29 ఏళ్ల రవీంద్ర సింగ్ భాటి ప్రవేశాన్ని కూడా రాజపుత్ సమాజం అసంతృప్తి నేపథ్యంలోనే చూడాలి. ఎబివిపి మాజీ విద్యార్థి నాయకుడైన భాటి, ఆ సంస్థతో విభేదించి స్వతంత్రంగా విద్యార్థి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. 2023లో, భాటి బార్మర్ జిల్లాలోని షియో నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. దీంతో బిజెపి నాలుగో స్థానానికి పరిమితమైంది. ఆ తర్వాత భాటి స్వతంత్ర అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి, 5.8 లక్షల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో రాజపుత్రులు దాదాపు పూర్తిగా బిజెపి కి దూరమయ్యారు.ఉత్తరాఖండ్‌లో, ఆశిష్ నేగి అనే ఒక రెచ్చగొట్టే యువ నాయకుడు ఉత్తరాఖండ్ క్రాంతి దళ్ పునరుద్ధరణకు నాయకత్వం వహిస్తున్నారు. భూమి, ఉద్యోగాలు, వనరులపై స్థానికుల హక్కులను పరిరక్షించడమే నేగి ప్రధాన వాదన. స్థానికుల ప్రయోజనాలను పణంగా పెట్టి బయటివారికి బిజెపి ప్రభుత్వం ప్రయోజనాలు కల్పిస్తోందని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే, అదృష్టవశాత్తూ తమకు బిజెపి తప్ప పెద్దగా ప్రత్యామ్నాయాలు లేవని అగ్రవర్ణాల వారు కూడా చాలా వరకు అంగీకరిస్తున్నారు. వారి ప్రకారం, కాంగ్రెస్ ఇప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సామాజిక న్యాయం కోసం పోరాడే పార్టీలతో సన్నిహితంగా ఉంటోంది. జాతీయ స్థాయిలో కూడా అదే విధానాన్ని అనుసరిస్తుంది. అందువల్ల, అభ్యర్థులను బట్టి కేవలం కొన్ని నిర్దిష్ట స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. దతియాలో జరిగింది ఇదే. కొంతకాలం పాటు, సోషల్ మీడియాలో అగ్రవర్ణ యువతలో ఒక వర్గం మధ్య ఆమ్ ఆద్మీ పార్టీ ఆసక్తిని రేకెత్తించింది, కానీ 2025లో ఢిల్లీలో ఓటమి తర్వాత ఆ ఆసక్తి సన్నగిల్లింది. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ విజయం ఈ వర్గంలో, ముఖ్యంగా సోషల్ మీడియాలో, బీహార్ వెలుపల కూడా గణనీయమైన చర్చకు దారితీసింది. తన గెలుపు ద్వారా బీహార్ ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేస్తూ విమర్శలు గుప్పిస్తూ, ప్రధాని మోడీ పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది.

## ప్రత్యక్ష పోరుకే బాబు జై.. వైసీపీలో జోష్!



అమరావతి,మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్లలో మేయర్లను నేరుగా ఎన్నుకునే పాత విధానానికే కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టడానికి నిర్ణయించింది. తాజా నిర్ణయంపై వైసీపీలో జోష్ కనిపిస్తోంది. మరోవైపు టీడీపీ ప్రజాప్రతినిధుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ఎందుకనో తమ పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాల్ని సీఎం చంద్రబాబు పరిగణలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకతను చంద్రబాబు పట్టించుకోవడం లేదన్న చర్చ టీడీపీలో జరుగుతోంది. ప్రభుత్వంపై 90 శాతం సానుకూలత వుందనే సర్వే సంస్థల అభిప్రాయాల్ని నిజమే అని చంద్రబాబు నమ్ముతున్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అంతర్గత సంభాషణల్లో వాపోతున్నారు.ఈ నేపథ్యంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో చైర్మన్లు, మేయర్లను ప్రజలు నేరుగా ఎన్నుకునేలా అసెంబ్లీలో బిల్లు పెట్టడానికి నిర్ణయించడంపై టీడీపీలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. మరో రెండు నెలల్లో మున్సిపల్, కార్పొరేషన్లు, నగర పాలక సంస్థలకు మొదటగా ఎన్నికలు నిర్వహించాలనే ఉత్సాహంలో చంద్రబాబు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ వరకూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఓకే అంటున్నారు. అయితే చైర్మన్లు, మేయర్లను నేరుగా ఎన్నుకోవాల్సి వస్తే, అంతిమంగా కూటమి రాజకీయంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పరోక్ష పద్ధతిలో ఎన్నుకునే విధానమైతే, ప్రతి మున్సిపాల్టీ, కార్పొరేషన్‌ను కూటమే హస్తగతం చేసుకుంటుందని మంత్రులు, ఎమ్మెల్యేలు అంటున్నారు. ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటే, ప్రజాభిప్రాయం ఎలా వుంటుందో చెప్పలేని పరిస్థితి వుందని వారు భయపడుతున్నారు. కూటమి పాలనపై ప్రజల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ ఊహిస్తున్నట్టుగా విపరీత సానుకూల వాతావరణం లేదని చెబుతున్నారు.తమ వ్యతిరేకతను తెలియజేయడానికి కూటమి చైర్మన్, మేయర్ అభ్యర్థులను ఓడించాలని అనుకుంటే, అసలుకే ఎసరు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరోక్ష విధానంలో అయితే మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థల్లో కౌన్సిలర్లు, కార్పొరేషన్లలో కార్పొరేటర్లను ఎలాగోలా ఏకగ్రీవం చేసుకోవడమో, లేక ప్రతిపక్ష అభ్యర్థులు గెలిస్తే, వారిని తమ వైపు తిప్పుకునో, చివరికి చైర్మన్, మేయర్ పీఠాలను సొంతం చేసుకునేవాళ్లమని అంటున్నారు. ఈ విషయమై మంత్రి నారా లోకేశ్ ద్వారా సీఎం చంద్రబాబుకు చెప్పినా, ఎందుకనో ఆయన పట్టించుకోలేదని మంత్రులు, ఎమ్మెల్యేలు లబోదిబోమంటున్నారు. ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికల ద్వారా, వైసీపీ 40 శాతం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను దక్కించుకున్నా, రానున్న రోజుల్లో రాజకీయంగా కూటమి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం వుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అయితే ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై వైసీపీలో జోష్ కనిపిస్తోంది. ఈ విధానం రాజకీయంగా తమకు అనుకూలం అవుతుందని ఆ పార్టీ నాయకులు నమ్ముతున్నారు. పరోక్ష విధానంలో కంటే, ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు జరగడం ఏ రకంగా చూసినా వైసీపీకి లాభిస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. ఏది ఏమైనా ప్రత్యక్ష పద్ధతిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలన్న చంద్రబాబు నిర్ణయంపై మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారనేది వాస్తవం. వైసీపీ ఏ మేరకు తమకు అనుకూలంగా మలుచుకుంటుందో చూడాలి.

### టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి పదవీ బాధ్యతలు

టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆహార, ఔషదాల నాణ్యత ప్రమాణాలను మరింతగా మెరుగు పరచడానికి ప్రభుత్వం ఆహార భద్రత, ఔషధ నియంత్రణ భాగాలను వీలీనం చేసి టీజీ సేఫ్‌గా ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈ శాఖకు డైరెక్టర్‌గా అవినాశ్ మహంతి డైరెక్టర్ గా కొనసాగనున్నారు.

## అమరావతిలో భూమి కేటాయింపునకు అనుమతి లేదు

అమరావతి,అమరావతిలో అమలులో ఉన్న భూకేటాయింపు నిబంధనల ప్రకారం ప్రైవేట్ అసోసియేషన్లకు భూములు కేటాయించే అవకాశం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు అమరావతిలో భూమి కేటాయింపు అంశంపై ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో మంత్రి సమాధానం ఇచ్చారు.బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తమ స్టేట్ ఆఫీస్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం అమరావతిలో ఐదు ఎకరాల భూమిని కోరుతూ సీఆర్డీఏకు దరఖాస్తు చేసిందని మంత్రి తెలిపారు. అయితే అమరావతిలో భూముల కేటాయింపునకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఆ భూమిని కేటాయించే అవకాశం లేకపోవడంతో అసోసియేషన్‌కు భూమి కేటాయించలేదని స్పష్టం చేశారు.సుప్రీంకోర్టు 2024 నవంబర్ 25న ఇచ్చిన ఆదేశాల ఆధారంగా అమరావతిలో భూముల కేటాయింపునకు సంబంధించిన రూల్స్, రెగ్యులేషన్స్ రూపొందించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. భూముల కేటాయింపునకు సంబంధించి ఆరు రకాల మోడల్స్‌తో రూల్స్, ఐదు రకాల మోడల్స్‌తో రెగ్యులేషన్స్ రూపొందించామని వివరించారు. ఈ రూల్స్, రెగ్యులేషన్స్ ఆధారంగానే అమరావతిలో భూముల కేటాయింపు జరుగుతోందన్నారు.2017 జూన్ 15న జారీ చేసిన జీవో నంబర్ 228లోని అమరావతి భూకేటాయింపు నియమావళి రూల్ 5 ప్రకారం బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు భూమి కేటాయించే అవకాశం లేదని మంత్రి స్పష్టం చేశారు. అదే విధంగా 2017 జూన్ 15న జారీ చేసిన జీవో నంబర్ 229లోని అమరావతి భూకేటాయింపు నిబంధనావళి క్లాజ్ 6.5 ప్రకారం కూడా భూమి కేటాయింపు సాధ్యం కాదని తెలిపారు.ఆయా నిబంధనల ప్రకారం నామినేషన్ లేదా దరఖాస్తు ప్రాతిపదికన ప్రైవేట్ అసోసియేషన్లకు అమరావతిలో భూమి కేటాయించేందుకు అనుమతి లేదని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల నిబంధనలకు అనుగుణంగానే బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు భూమి కేటాయించలేదని స్పష్టం చేశారు.

కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై మంత్రి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల కారణంగా కాంట్రాక్టర్లకు దాదాపు రూ.3 వేల కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి నారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.ఆర్థిక పరిస్థితిని పరిశీలించిన అనంతరం ఫైనాన్స్ శాఖ ఇప్పటికే మెజారిటీ పెండింగ్ బిల్లులను చెల్లించిందని మంత్రి తెలిపారు. మిగిలిన పెండింగ్ బిల్లులను కూడా వీలైనంత త్వరగా చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.మిగిలిన బిల్లుల విషయంలో ఫైనాన్షియల్ ఫీజిబిలిటీని పరిశీలించిన అనంతరం వాటిని కూడా చెల్లించే చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ అసెంబ్లీలో స్పష్టం చేశారు.

## రెవెన్యూ శాఖలో ఒక్క ఫైల్ కూడా కదలడం లేదు

హైదరాబాద్,రాష్ట్రంలో 22ం సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోంది. ఎవరి భూమి 22ం లో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.సోమవారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ం లో పెట్టడం ఏ రకమైన న్యాయం.. ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనం. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ం నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ం లో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్మెంట్ ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలి. తమ ప్రాపర్టీ 22ం లో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ం లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని అన్నారు.గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔాఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ం లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.22ం అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారింది. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ఫైల్ కూడా కదలడం లేదు. చివరకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఇల్లు కూడా 22ం ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైంది. నీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. యంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? వాళ్ల గోడు ఎవరు వినాలని అన్నారు.. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరు. ముందు అడ్డగోలుగా భూములను 22ం లో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి? కమిషన్ల కోసమేనా.. అసలు ఈ ప్రాపర్టీలను 22ం లో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు? దీనిపై తక్షణమే విచారణ జరగాలి. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టిన వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి.

### డీఎస్సీని బాధ్యతాయుతంగా నిర్వహించాం

డీఎస్సీ పరీక్షను చాలా బాధ్యతగా తీసుకొని నిర్వహించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏటా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిమని, మొత్తం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశామన్నారు. అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో తెదేపా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలుచేసిందని వివరించారు. టీచర్ల నియామకాలు, బదిలీలు పారదర్శకంగా ఉండాలన్న సీఎం ఆదేశాల మేరకు పనిచేస్తున్నామన్నారు.

# పాకిస్తాన్ కూటమికి భారత్ ఝలక్..! ఈజిప్ట్ నిర్ణయం వెనుక ?

న్యూఢిల్లీ,భారత్–ఇజ్రాయెల్ సంబంధాలు బలపడుతుండటం, ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య వైరం పెరుగుతుండటం వంటి కారణాలతో ప్రాంతీయ భద్రతకు ముప్పు పేరుతో పాకిస్తాన్–సౌదీ అరేబియా–టర్కీ ఈ మధ్య మక్కా రక్షణ ఒప్పందంచేసుకున్నాయి. దీని ప్రకారం ఈ మూడు దేశాలపై ఏ దేశం దాడి చేసినా, అది మూడు దేశాలపై జరిగిన దాడిగానే భావించి ప్రతీకార దాడులకు దిగుతాయి. ఈ కూటమిలో తొలుత పాకిస్తాన్–సౌదీ అరేబియా మాత్రమే ఉండగా.. ఆ తర్వాత నాటో దేశమైన టర్కీ చేరింది. ఆ తర్వాత ఈజిప్ట్ చేరుతుందని భావించినా అలా జరగలేదు. అయినా ఈ కూటమిని ట్రంప్ స్వాగతిస్తున్నారు.

ట్రంప్ కు ఇరాన్ ఘాటు కౌంటర్ – అవన్నీ ఆయన భ్రమలే..!

ఈ నేపథ్యంలో భారత్ కు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారబోతున్న ఈ కూటమిలోకి ఈజిప్ట్ చేరకుండా దూరంగా ఉండిపోవడం వెనుక పలు కీలక కారణాలు ఉన్నాయి. వాటిలో భారత్ కూడా ఒకటి. ఆఫ్రికాలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాన్ని కలిగిన ఈజిప్ట్, ఖతార్, కువైట్, జోర్డాన్, అజర్‌బైజాన్, సిరియాలతో పాటు ఈ కూటమిలో చేరే అవకాశాలు కనిపించాయి. అయితే సౌదీ అరేబియా నుండి ఈ కూటమిలో ఈజిప్ట్ చేరికపై వ్యతిరేకత వచ్చింది. దీనికి కారణం భారతదేశం వంటి దేశాలతో తమ సంబంధాలను దెబ్బతీసుకోవడానికి ఈజిప్ట్ సుముఖంగా లేకపోవడం వంటి కారణాల వల్ల, ప్రస్తుతానికి ఈ ఇస్లామిక్ నాటో కూటమిలో ఈజిప్ట్ సభ్యదేశంగా చేరలేదు.

శత్రు దుర్భేద్యంగా పాక్ కూటమి..! త్వరలో మరో దేశం చేరిక..!



వాస్తవానికి ఈజిప్ట్ తో భారత్ కు సత్సంబంధాలు ఉన్నాయి. 1956లో బ్రిటిష్–ఫ్రెంచ్ దళాలు సూయజ్ కాలువ వైపు దూసుకుపోతున్నప్పుడు, ఇజ్రాయెల్ సాయుధ దళాలు సినాయ్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు, ఆంగ్లో–ఫ్రెంచ్–ఇజ్రాయెల్ సైనిక చర్యను భారత్ ఖండించింది. సూయజ్ కాలువపై ఈజిప్ట్ హక్కుకు మద్దతుగా నిలిచింది. ఆ తర్వాత 1961లో భారత దళాలు అప్పటి పోర్చుగీసు కాలనీ అయిన గోవాను విముక్తి చేయడానికి కవాతు చేస్తున్నప్పుడు సూయజ్ కాలువ గుండా పోర్చుగీస్ అదనపు బలగాలు వెళ్లకుండా ఈజిప్ట్ అడ్డుకుంది. తద్వారా భారత్ రుణం తీర్చుకుంది. ఇప్పుడు పాకిస్తాన్ కూటమిలో చేరకపోవడం ద్వారా భారత్ వైపు ఉండాలని ఈజిప్ట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# గంగా ఎక్స్‌ప్రెస్ వే.. గంగార్పణం: ఒక్క వర్షానికే ధమాల్.. !!

లక్నో:ఉత్తర్ ప్రదేశ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన గంగా ఎక్స్‌ప్రెస్‌వే భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ఎక్స్‌ప్రెస్‌వే పలుచోట్ల దెబ్బతిన్నది. ఇది విస్మరించకముందే ఉత్తర్ ప్రదేశ్ లోనే ఉన్నవ్ జిల్లా పరిధిలో మరో ఎక్స్‌ప్రెస్ కుంగిపోయింది. రహదారుల భద్రత, వాటి నిర్మాణంలో డొల్లతనం ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ పరిణామాలు ప్రయాణికులలో తీవ్ర భయాందోళనలను కలిగిస్తోంది.ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ఏడాది ఏప్రిల్ 29న ప్రారంభమైంది భారీ ఎక్స్‌ప్రెస్‌వే. ఈ నాలుగు నెలల కాలంలోనే ఇలా దెబ్బతినడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు అనుసంధానించే ఈ రహదారిలో ఉన్నవ్ జిల్లా సోనిక్ ప్రాంతం పరిధిలో 421 కిలోమీటర్ వద్ద గల ఇది భారీగా కుంగిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డు పక్క భాగం కొట్టుకుపోయింది.రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ర్యాంప్ వద్ద మట్టి, గ్రావెల్.. వర్షపు నీటి ఉధృతికి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. దీంతో అక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు కుంగిపోయింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సుమారు 37,000 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన ఈ గంగ ఎక్స్‌ప్రెస్‌వే నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ ఈ స్ట్రెచ్ నిర్మాణ పనుల బాధ్యతలను చేపట్టినట్లు సమాచారం.సోనిక్ ప్రాంతంలో దెబ్బతిన్న గంగా ఎక్స్‌ప్రెస్‌వే మరమ్మతు పనులు కొనసాగుతుండగానే.. దహి చౌకీ– బషీరత్‌గంజ్, హసన్‌పూర్– ఫయాజ్‌నగర్, సహ్దారా మిలక్ గ్రామాల సమీపంలో కూడా రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి. సరాయ్ కతియాన్ కెనాల్ సమీపంలో రోడ్డు అంచులు దెబ్బతిన్నాయి. దీనిని గమనించిన స్థానికులు వెంటనే ఉన్నతాధికారులను సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే



స్థానిక అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.వంతెన ఎక్స్‌ప్యాన్షన్ జాయింట్ల వద్ద ప్రస్తుతం పునర్నిర్మాణ పనులు సాగుతున్నాయి. రోడ్డు కుంగిన భాగాన్ని సరిచేయడానికి అవసరమైన యంత్రాలు, సామాగ్రిని రంగంలోకి దించారు. ఈ ఎక్స్ ప్రెస్ వే కు సమాంతరంగా నిర్మించిన డ్రైనేజీ కాలువలు కూడా చాలా చోట్ల ధ్వంసమైనట్లు గుర్తించారు. దీని కారణంగానే నీరు లీక్ అయిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇలా ఒకేసారి వేర్వేరు ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల గంగా ఎక్స్ ప్రెస్ వే దెబ్బతినడంపై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ఘాటుగా స్పందించింది.ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శల దాడి చేసింది. గంగా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ నాణ్యత అత్యంత అధ్వాన్నంగా ఉందనడానికి ఈ ఘటనలే సాక్ష్యమని ఆరోపించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, కమీషన్ల కోసమే పనులను నాసిరకంగా పూర్తి చేశారని సమాజ్ వాది పార్టీ నేతలు విమర్శించారు.

# అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త..



హైదరాబాద్ : తెలంగాణ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రేవంత్ రెడ్డి సర్కార్ భారీ గుడ్‌న్యూస్ చెప్పింది. రిటైర్మెంట్ సమయంలో అంగన్వాడీ సిబ్బందికి అందించే సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెట్టింపు చేసింది. దీంతో 65 ఏళ్ల వయస్సు పూర్తై రిటైర్ అయ్యే అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, అంగన్వాడీ హెల్పర్లకు రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రయోజనం అందనుంది. అంతేకాదు 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అంగన్వాడీ సిబ్బంది స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగే వారికి కూడా ఇవే ప్రయోజనాలను వర్తింపజేయనున్నట్లు సర్కార్ వెల్లడించింది.కేంద్ర ప్రభుత్వ మిషన్ సక్షమ్ అంగన్వాడీ పోషణ్ 2.0 మార్గదర్శకాల ప్రకారం.. అంగన్వాడీ సిబ్బందికి గరిష్ట పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లుగా నిర్ణయించారు. గతంలో అంగన్వాడీ టీచర్లకు రూ.లక్ష.. హెల్పర్లు, మినీ అంగన్వాడీ వర్కర్లకు రూ.50 వేలుగా సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ ఉండేవి. అయితే ప్రభుత్వం ఈ మొత్తాలను పెంచింది. కొత్త నిబంధనల ప్రకారం 65 ఏళ్ల వయస్సులో విధుల నుంచి వైదొలిగే అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ అందిస్తున్నారు.అలాగే 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అంగన్వాడీ సిబ్బంది స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగినా ఈ ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,572 మంది అంగన్వాడీ సిబ్బంది బ్యాంకు అకౌంట్లలో సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ కింద రూ.15.61 కోట్లు జమ చేశారు. ఇందులో 473 మంది అంగన్వాడీ టీచర్లకు రూ.4.73 కోట్లు.. 1,930 మంది అంగన్వాడీ హెల్పర్లకు రూ.9.65 కోట్లు చెల్లించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

# రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్ట?



హైదరాబాద్, ఆగస్టు 18,తెలంగాణ రాజకీయాలు రోజురోజుకూ సరికొత్త వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై జరగాల్సిన రాజకీయ చర్చ.. క్షుద్రపూజలు, అఘోరా యాగాల స్థాయికి దిగజారడం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ములుగు జిల్లా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ చేసిన అఘోరా పూజల వ్యాఖ్యలు, దానికి మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన ఘాటు కౌంటర్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి.ములుగులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా ప్రతిపక్ష బీఆర్ఎస్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక కీలక 'మేనల్లుడు' పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులకు వెళ్లి అఘోరా పూజలు, క్షుద్ర తంత్రాలు చేయించారని ఆరోపించారు. తెలంగాణలో వర్షాలు కురవకూడదని, కరవు తాండవించాలని, తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని కోరుకుంటూ ఈ క్షుద్ర క్రియలకు పాల్పడ్డారని సీఎం విమర్శించారు. "ప్రజలు చనిపోయినా పర్వాలేదు.. ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలన్నదే వారి కుట్ర. ఎన్ని క్షుద్రపూజలు చేసినా భగవంతుడు ప్రజాపక్షాన నిలబడ్డాడు కాబట్టే వర్షాలు సమృద్ధిగా కురిసి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిండింది" అంటూ రేవంత్ రెడ్డి తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు.సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తక్షణమే స్పందించారు. ఈ వ్యాఖ్యలను పూర్తిగా నిరాధారమైనవిగా, రాజకీయ దిగజారుడుతనంగా కొట్టిపారేశారు. పాలనా వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి చౌకబారు ప్రచారాలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. "ఇలాంటి వ్యక్తిగత దాడులకు, చిల్లర రాజకీయాలకు నేను భయపడను. రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాను" అని స్పష్టం చేశారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, కోర్టుల ద్వారా న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇప్పటికే తనపై ఇలాంటి ఆరోపణలు చేసినందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిలకు లీగల్ నోటీసులు పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.సాగుతున్న ఈ ఘర్షణ కేవలం రెండు పార్టీల ఆరోపణలకే పరిమితం కాలేదు. దీని వెనుక వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర క్షేమాన్ని కోరుకోవడం లేదని, అధికారం కోసం రాష్ట్ర ప్రజలకు హాని తలపెట్టే స్థాయికి వెళ్లారనే భావనను ప్రజల్లో బలంగా నాటడం అధికార కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఎన్నికల హామీలు, రుణమాఫీ, ఇతర పరిపాలనాపరమైన సమస్యలను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోలేకనే 'చేతబడి', 'క్షుద్రపూజలు' వంటి పాతకాలపు సెంటిమెంట్లను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. కాంగ్రెస్ నేతలు రాజకీయ సభల్లో పర్సెప్షన్ వార్ సాగిస్తుంటే, హరీష్ రావు లీగల్ నోటీసుల ద్వారా కాంగ్రెస్ నేతలను న్యాయపరంగా ఇరుకున పెట్టాలని చూస్తున్నారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలు, తాగునీరు, విద్య, ఉద్యోగాల కల్పనపై నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన తరుణంలో, ప్రధాన పార్టీల మధ్య క్షుద్రపూజల చుట్టూ రాజకీయాలు నడవడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం ఆరోగ్యకరం కాదు. ఒకరిపై ఒకరు నైతికతను కోల్పోయి చేసుకుంటున్న ఈ వ్యక్తిగత ఆరోపణలు ప్రజాక్షేత్రంలో ఏ మేరకు ప్రభావం చూపుతాయో, ప్రజలు ఎవరి వాదనను విశ్వసిస్తారో వేచి చూడాల్సిందే.

## గురుకుల పాఠశాలలో జూనియర్లపై సీనియర్ల దాడి

ఖమ్మం,కారేపల్లి మండలం గాంధీనగర్లోని గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్లపై దాడికి దిగారు. దాంతో బాధిత విద్యార్థులు భయంతో సమీపంలోని రైల్వే స్టేషన్కు వెళ్లి దాక్కున్నారు. దాడి చేసిన విద్యార్థులు హాస్టల్ నుంచి పారిపోయారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిబ్బంది ఆటల పోటీలు నిర్వహించారు. అందులో కబడ్డీ ఆటలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులపై పదో తరగతి విద్యార్థులు విజయం సాధించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థుల ఓటమి తట్టుకోలేక, పదో తరగతి విద్యార్థులపై ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు విచక్షణారహితంగా దాడి చేసారు. పదో తరగతి విద్యార్థులు భయంతో సమీపంలోని రైల్వే స్టేషన్లో దాక్కోగా, దాడికి పాల్పడిన 50 మంది విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్టు సిబ్బంది వెల్లడించారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. పోలీసులు విషయం తెలుసుకుని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# జీవన్ రెడ్డి సీన్ రిపీట్ కానుందా? హస్తం పార్టీకి సీనియర్ల తిరుగుబాటు సెగ !

హైదరాబాద్, కాంగ్రెస్ గురించి తెలిసిందేగా! కుమ్ములాటలు, అలక బాటలు.. అక్కడ అన్నీ కామన్. ముఖ్యంగ్గ?.. సీనియర్ లీడర్ల అసంతృప్తికి తెరపడట్లేదు. కొన్ని నెలల క్రితమే.. జీవన్ రెడ్డి ఎపిసోడ్‌తో గాంధీభవన్‌కు షాక్ తగిలింది. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడిన వారిని కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని జీవన్ రెడ్డి వెళ్లిపోయారు. ఇప్పుడు.. జిల్లాల్లో వర్గపోరు జోరుగా నడుస్తోంది. ముఖ్యంగా.. వనపర్తి పాలిటిక్స్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి మధ్య ఆధిపత్య పోరు పీక్‌కి చేరింది. డబ్బులిచ్చి ఎమ్మెల్యే టికెట్ కొనుక్కున్నారంటూ.. చిన్నారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మేఘారెడ్డి.. తన అనుచరులను ఇబ్బందిపెడుతున్నారని ఫైర్ అయ్యారు. ఇదిలాగే కొనసాగితే.. జీవన్ రెడ్డిలాగా పార్టీపై తిరగబడాల్సి వస్తుందన్నారు.

చిన్నారెడ్డిపై మేఘా రెడ్డి ఫైర్..

చిన్నారెడ్డి మతితప్పి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఫైర్ అయ్యారు. 2018లో.. 50 వేల ఓట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయారన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెనక ఉండి డ్రామా ఆడిస్తున్నారని ఆరోపించారు.

హీటెక్కిన ఉమ్మడి నల్గొండ..

ఇక.. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాలు మరింత హీటెక్కాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తన అసమ్మతి గళాన్ని వినిపించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్.. మీనాక్షి నటరాజన్, జిల్లా మంత్రులు హాజరైన.. ఉమ్మడి నల్గొండ జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మీటింగ్‌కు..




ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దూరంగా ఉండటం పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, బయటి నుంచి వచ్చి చక్రం తిప్పుతున్న వారి తీరుపై ఆయన అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు.

సీనియర్ల బహిరంగ అసంతృప్తి..

పార్టీ పెద్దలు ఎన్ని సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నా.. సీనియర్ల బహిరంగ అసంతృప్తి.. ప్రభుత్వానికి, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తలనొప్పిగా మారుతోంది. వనపర్తిలో చిన్నారెడ్డి–మేఘారెడ్డి వర్గపోరు, నల్గొండలో రాజగోపాల్ రెడ్డి తీరు.. కాంగ్రెస్ హైకమాండ్‌కు తీవ్ర సవాల్‌గా మారాయి. ఈ అంతర్గత కుమ్ములాటలను గాడిలో పెట్టకపోతే.. పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఈ అసమ్మతి జ్వాలల్ని అధిష్టానం, పీసీసీ చీఫ్ ఎలా చల్లారుస్తారనేదే ఆసక్తిగా మారింది.

# అటు విజయ్ ను.. ఇటు బీజేపీని.. అన్నామలై ఏసేసుకున్నాడిలా..



చెన్నై:తమిళనాడు రాజకీయాల తీరు ఎప్పుడూ కాస్త ఆసక్తికరంగానే ఉంటుంది. అయితే తాజాగా బీజేపీ నుంచి బయటకొచ్చి కొత్త పార్టీ పెట్టిన అన్నామలై పేల్చిన బాంబులు చూసి రాజకీయ విశ్లేషకులు కూడా ఒక్కసారిగా ముక్కున వేలేసుకుంటున్నారు. ఎందుకంటే ఆయన ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా.. ఇటు రాష్ట్రంలోని 'విజయ్ ప్రభుత్వం'పై అవినీతి బాణాలు విసురుతూనే అటు తానూ భాగమైన కేంద్ర ప్రభుత్వంపై 'గుజరాత్ ప్రాధాన్యం' పేరుతో విమర్శల వర్షం కురిపించారు.

మంత్రుల లంచాల పర్వం.. "ఎన్నికల ఖర్చు రికవరీ సీన్"

తమిళనాడు ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గారు చాలా నీతిమంతుడే కావచ్చు.. కానీ ఆయన చుట్టూ ఉన్న కొందరు మంత్రుల వ్యవహారం మాత్రం 'భలే మంచి చౌక బేరం'లా ఉందని అన్నామలై ఎద్దేవా చేశారు. కాంట్రాక్టులు కావాలంటే 2 నుంచి 4 శాతం వరకు 'చందా' లంచం సమర్పించుకోవాల్సిందేనని మంత్రులు డిమాండ్ చేస్తున్నారట. "అయ్యా మొన్నటి ఎన్నికల్లో మేం కోట్లు కుమ్మరించాం.. ఇప్పుడు కాంట్రాక్టుల రూపంలో ఆ డబ్బులు రికవరీ చేసుకోకపోతే ఎలా?" అని సదరు మంత్రులు కాంట్రాక్టర్ల వద్ద ఓపెన్‌గానే మాట్లాడేస్తున్నారట.. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డులు కూడా తమ దగ్గర సిద్ధంగా ఉన్నాయని అన్నామలై వ్యాఖ్యానించడం కోలీవుడ్ డ్రామాను తలపిస్తోంది. పాలనపై పట్టు సడలితే పరిస్థితులు చేజారిపోతాయని.. సీఎం గారు తక్షణమే ఈ 'రికవరీ మంత్రుల'పై చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేంద్రంపైనా విమర్శల బాణం.. "అన్నీ గుజరాత్‌కేనా మరి మా సంగతేంటి?"

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలతో సరిపెట్టకుండా అన్నామలై కేంద్ర ప్రభుత్వంపై కూడా సెటైరికల్ బాణాలు విసిరారు. పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కేంద్ర పెద్దలకు గుజరాత్ తప్ప వేరే రాష్ట్రం కనబడటం లేదేమో అన్నట్లుగా మాట్లాడారు. చిన్న వేఫర్స్ కంపెనీల నుంచి భారీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థల వరకు.. ప్రతిదీ అహ్మదాబాద్ లేదా గాంధీనగర్ వైపే రూట్ మ్యాప్ వేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పోనీ ప్రాజెక్టులే అనుకుంటే.. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2030 పోలీస్ గేమ్స్, చివరికి 2036 ఒలింపిక్స్ వరకు ప్రపోజల్స్ అన్నీ గుజరాత్ గడప దాటడం లేదని విమర్శించారు. "దేశంలో మిగతా రాష్ట్రాలు కూడా ఉన్నాయి కదా స్వామీ.. అందరికీ కాస్త సమాన అవకాశాలు ఇస్తే బాగుంటుంది" అని విన్నవించారు. కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రస్థాయి నేతలను కూడా భాగస్వాములను చేస్తే 'సమతుల్య అభివృద్ధి' అనే పదానికి అర్థం ఉంటుందని అభిప్రాయపడ్డారు.ఒకే వేదికపై ఇటు రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని, అటు కేంద్ర ప్రభుత్వ గుజరాత్ ప్రేమను ఎండగడుతూ అన్నామలై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి. మరి ఈ 'ద్విముఖ' విమర్శలపై ద్రవిడ నేతలు, కేంద్ర పెద్దలు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే..

# ఏపీ పై ఫోకస్.. బిజెపి భారీ స్కెచ్!




విజయవాడ:ఏపీ పై ఫుల్ ఫోకస్ పెట్టింది భారతీయ జనతా పార్టీ. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విశాఖకు చేరుకున్నారు. ఈరోజు పార్టీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 945 మండలాల నుంచి బాధ్యులు హాజరుకానున్నారు. ఒకవైపు కూటమి ధర్మాన్ని పాటిస్తూనే ఒంటరిగా ఎదగాలన్నది బిజెపి ప్రణాళికగా తెలుస్తోంది. అందులో భాగంగానే తెలుగు రాష్ట్రాల పై ఫుల్ ఫోకస్ పెట్టింది. తెలుగు రాష్ట్రాల బలంతోనే కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చింది భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ. ఏపీలో కూటమిపరంగా 21 పార్లమెంట్ సీట్లు.. బిజెపి సొంతంగా మూడు స్థానాల్లో విజయం సాధించింది. అయితే టిడిపి, జనసేనతో పోల్చుకుంటే భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలు అంతంత మాత్రం అన్న విమర్శలు ఉన్నాయి. ఈ తరుణంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటనకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పెద్దపెద్ద నాయకులు ఉన్నా...

ఏపీలో భారతీయ జనతా పార్టీలో హేమాహేమీలైన నాయకులు ఉన్నారు. పార్టీలో సీనియర్లు సైతం కొనసాగుతున్నారు. అయినా సరే పార్టీ ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదు. ముఖ్యంగా పార్టీలో సీనియర్ల మధ్య సమన్వయం అంతంత మాత్రమేనని తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ఉన్నారు. తాజాగా బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలుగా పురందేశ్వరి, ఉపాధ్యక్షుడిగా రామ్ మాధవ్ ఎన్నికయ్యారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి లోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర మంత్రిగా సత్య కుమార్ యాదవ్, కేంద్ర సహాయ మంత్రిగా భూపతిరాజు శ్రీనివాస్ వర్మ బిజెపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సీఎం రమేష్ తో పాటు సుజనా చౌదరి, ఆదినారాయణ రెడ్డి ఇలాంటి సీనియర్లు ఉన్నారు.. కానీ ఆశించిన స్థాయిలో బిజెపి బలపడడం లేదు. అందుకే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశా నిర్దేశం చేస్తారని తెలుస్తోంది.

స్థానిక ఎన్నికలపై చర్చ..

ప్రాంతాలవారీగా బిజెపి బలపడేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక వర్గ పరంగా, యువత పరంగా ఈసారి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. పార్టీలో సమూల ప్రక్షాళన తీసుకొచ్చి సొంతంగా ఎదగాలని అజెండాతో బిజెపి ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు కూటమిపరంగా రెండు పార్టీలతో మైత్రి కొనసాగిస్తూనే.. ఇంకోవైపు రాజకీయంగా బలపడాలన్న కోణంలో బిజెపి ముందుకు వెళ్తోంది. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో కూడా బిజెపి వైఖరి మారింది. ఆ పార్టీ నేతలు స్ట్రాంగ్ గా ప్రకటనలు చేస్తున్నారు. అయితే ఇవన్నీ స్థానిక సంస్థల ఎన్నికల కోసమేనని స్పష్టమవుతోంది. విశాఖలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. మొత్తానికి అయితే ఏపీపై బీజేపీ ఫోకస్ పెట్టడం నిజంగా శుభ పరిణామమే..

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140